
# వంపు




ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

చాలా కాలం తరవాత తాతగారి ఊరు బయలుదేరాను. బస్సు కదిలింది. మెల్లగా వేగం పుంజుకుంది. కానీ - నా మనస్సు బస్సుకంటే ముందుగానే తాతగారి ఊరు చేరిపోయింది!

ఎంతో ప్రశాంతంగా... నిశ్శబ్దంగా... ఆహ్లాదంగా ఉండే ఆ ఊరికి వెళ్ళడం నాకు ఒక గొప్ప అనుభూతి

చదువుకునే రోజుల్లో వేసవి సెలవులు ఇచ్చిన ప్రతిసారీ క్రమం తప్పకుండా అమ్మతోపాటు తాతగారి ఊరెళ్ళేవాళ్ళం.

చేల గట్లమ్మటా... తోటలమ్మటా... కాలవగట్ల వెంటా... తమ్ముళ్ళతోటీ నేస్తాల తోటీ ఆడుకోవడం అద్భుతంగా ఉండేది.

ముఖ్యంగా నూరిగాడూ, కిష్టిగాడూ, పండుగాడూ నాకు వేసంగి నేస్తాలు! వాళ్లతో కాలక్షేపం మహత్తరంగా ఉండేది. పండుగాడు చెట్లెక్కడంలో దిట్ట. ఎంత పెద్ద చెట్టయినా సరే, కోతిలాగ ఎగబాకి ఎక్కేసే వాడు! పై నుంచి పళ్ళు కిందకి విసిరేవాడు. వాడు క్రిందకి దిగేలోపు వాడికి తెలీకుండా... నేనూ, తమ్ముళ్ళూ నగం లాగించేసే వాళ్ళం. పండుగాడు ఠీవీగా కిందకి దిగి, మా వైపు అదోలాంటి తమాషా చూపు చూసి, జేబులోంచి మాంచి దోరకాయలు తీసి మమ్మల్ని ఏడిపిస్తూ తినేవాడు!

అది తలుచుకుంటే ఇప్పటికీ నా నోరు ఊరుతుంది.

అట్లాంటి అనుభవాల కోసమే ఎడారిలాంటి నగరంలో వేసవి సెలవుల కోసం ఆత్రంగా ఎదురు చూసేవాళ్ళం.

సెలవులివ్వగానే బస్సెక్కేసే వాళ్ళం! హైదరాబాద్‌లో పొద్దుట బస్ ఎక్కితే సాయంత్రం చీకట్లు ముసిరే సమయానికి తాతగారి ఊళ్ళో దిగేవాళ్ళం. చీకటి పడినా సరే, ఆ ఊరుని ఇట్టే పట్టేసే వాళ్ళం. ఊరు దగ్గర పడుతోందని తెలుసుకునేందుకు పెద్ద బండ గుర్తు వంపు తిరిగిన రోడ్డు! ఆ వంపు చూడగానే బ్యాగులు చేత్తో పట్టుకుని దిగడానికి సిద్ధంగా ఉండేవాళ్ళం.

నాకయితే ఆ వంపు తిరిగిన రోడ్డుచూడగానే నరసమామ్మే ఠక్కున మెదులుతుంది!

ఆమె వంగి నడుస్తుంది!

వంపు తిరిగిన రోడ్డులా.... ఆమె వంగి నడవడమే నా చిరకాల జ్ఞాపకం! ఆమె నడుము బాగా వంగిపోయి, నడుస్తూంటే నాలుగు కాళ్ళతో నడుస్తున్నట్లు అనిపించేది! ఎవర్నయినా పలకరించవలసి వచ్చినప్పుడు కొద్దిగా నడుము ఎత్తిపెట్టీ, పెట్టనట్టు ఉంచి - కళ్ళని బాగా పైకి తేల్చి చూస్తూ మాట్లాడేది. నిజానికి ఆమె నడుముకన్నా తన కళ్ళనే బాగా పైకి తేల్చేది!

మా తాత గారి ఊర్లో మేం బాగా ఇష్టపడేది నరసమామ్మనే.

మేం చేసే అల్లరిని ఆనందంగా తట్టుకోవడమే కాదు.... మా కోసం ఎన్నో తినుబండారాలు చేసి పెట్టేది.

నాకు అత్యంత ఇష్టమైన పూతరేకుల్ని నోరూరించేట్టు చుట్టి డబ్బాలో దాచిపెట్టి ఉంచేది.

ఆవిడకి ఒక్కడే కొడుకు. ఆ కొడుకేమో బహుదూరంగా ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉంట్నూండడంతో నరసమామ్మకి పాపం మనవల అచ్చట్లూ అల్లరీ తీరలేదు. అందుకే - దూరపు చుట్టాలమైనా, వరసకి మనవలమైన మమ్మల్నే తన సొంత మనవల్లా ప్రేమించేది. ప్రతి వేసవికీ మేం తప్పకుండా వస్తామని మా కోసం ఎన్నో పిండివంటలు చేసి, దాచిపెట్టి ప్రేమగా తినిపించేది.

నరసమామ్మ ఎన్నో తినుబండారాలతో మా కోసం చూస్తూంటుందన్న ఆలోచనే మాకు జంతికలంత కమ్మగా పూత రేకులంత తియ్యగాఉండేది.

ఆమె చాలా ఓర్పున్న మనిషి. తుడిచిన గదినే మళ్ళీ తుడుస్తూ, కడిగిన గిన్నెల్నే మళ్ళీ కడుగుతూ... చేసిందే చేస్తూ - వంటింట్లోనో వంచలోనో ఉంటూండేది.

మేం ఆమె కోసం వెళ్ళినప్పుడు ఎప్పుడూ ముందు సావిట్లో కనిపించేది కాదు!

రైలు పెట్టెల్లా పొడవు గదులతో బారుగా ఉంటుంది వాళ్ళ ఇల్లు. దీర్ఘ చతురస్రాకారంగా ఉండే పొడవాటి హాలులోంచి మరో రెండు పెద్దగదులూ.... ఆ తరవాత వంట వసారా... దాని కుడి వక్కగా నూతి చెప్టా మీదుగా లోపలికి వెళితే కానీ ఆమె దర్శనం అయ్యేది కాదు!

ఇంటి చివరగా ఉన్న వంచలోనో... దానికి కొనసాగింపుగాఉన్న కొబ్బరి తోటలోనో ఏదో పనిచేస్తూ కనిపించేది!

వీధి మొగసాలలోంచి - "ఒసేయ్! ఇలారా!" అంటూ పెద్దకేక పెట్టేవాడు తాత!

ఆ కేక విని, ఆమె వడివడిగా,వంగి... తమాషాగానడుస్తూ - "వస్తున్నా" అని బదులు పలికేది. ఆమె బదులు ఇచ్చేలోపు మరో నాలుగు సార్లు అరిచేవాడాయన.

ఆమె చాలా క్రమశిక్షణతో తాత ముందు హాజరయ్యేది.

వక్కపొడి దగ్గర్నుంచీ వంకీ కర్ర దాకా తానే అందించేది.

తాత ఎప్పుడు చూసినా గ్గైగ్గైలాడుతూండేవాడు. ఓ పట్టాన ఏ పనీ ఆయనకు నచ్చదు.

అనంతమైన కోరికల నిధిలాగ ఎప్పుడూ అసంతృప్తిగానే ఉంటాడు. ఆయనకు ఈ ప్రపంచంలో చాలా చాలా నచ్చవు. పెళ్ళాం నచ్చదు. తనకున్న ఆస్తి నచ్చదు! చతుర్ముఖ పారాయణంలో ఓడిపోవడం నచ్చదు.



"అబ్బాయి ఎగ్రికల్చరల్ బీఎస్సీ చేశాడు. రెండు లక్షల కట్నంతో బాటు బండి కూడా కావాలని అడుగుతున్నాడు." అన్నారు పేరయ్య.

"అగ్రికల్చరల్ సైన్స్ కదా. రెండెడ్ల బండీ ఇస్తే సరిపోతుందా!" ఆశగా అడిగాడు కుటుంబ రావు.

[కవిటి] -గొంటు శ్రీనివాస్

అన్నం దగ్గర కూర్చుంటే ఎన్ని రుచులు కావాలో చెప్పలేం! మామిడికాయ పప్పు వండితే పిండి వడియాలూ, అప్పడాలూ ఉండాల్సిందే. ఎర్రటి ఆవకాయ కలుపుకుంటే చారెడు నూనె పోసి అవ్వాళ పెరుగు చిలికినప్పుడు నెయ్యి కాచడానికి తీసిన తాజా వెన్నముద్ద వెయ్యాల్సిందే! లేకపోతే నరసమామ్మ కళ్లు ఆవకాయ జాడీలయిపోతాయి.

అలవి మీరిన కోపంతో అస్థిమితంగానే కాదు, అమానుషంగా కూడా ఉంటాడాయన. కందిపొడి కథ తలుచుకుంటే ఇప్పటికీ నా కళ్లు మండుతాయి. తాత కంచంలోకి ఒకసారి కందిపొడి వడ్డించింది నరసమామ్మ. మేమంతా దాంకుని తాతకేసే చూస్తున్నాం. ఆయన కందిపొడి కలిపాడు.

"నూనె వెయ్యి" అన్నాడు గద్దింపుగా.

చిన్నగా ఉలిక్కిపడి నూనె వేసింది మామ్మ.

"నల్చుకోవడానికి వంకాయ పులుసు పచ్చడి చెయ్యలేదా?" ఛీంకరిస్తూ అరిచాడు.

నరసమామ్మ మిన్నకుండిపోయింది.

తాత కోపంతో కందిపొడి సీసాలోంచి చేరెడు కందిపొడి తీసి మామ్మ కళ్లలో చల్లాడు.

ఆ మంట ఓర్చుకోలేక, కళ్లు కనపడక పక్కనే ఉన్న రోటి మీదకి తూలిపడింది నరసమామ్మ. రక్తం చిమ్మింది.

నిజానికి అదంతా మా అల్లరే! "ఏంటి మామ్మా! ఎందుకు అన్నింటికీ తాతకి భయపడతావు? కందిపొడిలో నల్చుకోవడానికి వంకాయ పులుసు పచ్చడి చెయ్యకుంటే ఏం చేస్తాడో చూస్తాం!" అంటూ ఆమెని బలవంతంగా ఒప్పించింది మేమే!

అంతులేకుండా ఆమె అట్లా వంగి నడుస్తూనే ఉండేది. వంపు ఆమె జీవితానికి ఒక సంకేతం!

రెండేళ్ల క్రితం ఒక కార్డు వచ్చింది. "నరసమామ్మ భర్త కాలం చేశాడని దాని సారాంశం. నేను నరసమామ్మని పలకరించేందుకు వెళ్లలేకపోయాను. మళ్లా ఇన్నాళ్లను నరసమామ్మని చూద్దామని బయలుదేరాను.

"ఒరే శీనూ! నిన్ను చూడాలని ఉందిరా! తాత తద్దినానికి తప్పకుండా రా!" అంటూ నరసమామ్మ రాసిన కార్డు అందుకుని బయలుదేరకుండా ఎలా ఉంటాను!

ఇప్పుడు మామ్మ ఎలా ఉందో?

కిష్టిగాడు, సూరిగాడు, పండుగాడూ బాగా పెద్దాళ్లయి ఉంటారు. ఇంకా అక్కడే ఉన్నారో? ఏ ఉద్యోగాలకో వెళ్లిపోయారో?

ఆ చేలగట్లూ, ఆ తోటలూ, కాలువ గట్లూ ఆలాగే ఉంటాయి. కానీ వాటి మధ్య అప్పటి ఆటలూ, పాటలూ ఇప్పుడు సాధ్యమేనా?

ఆలోచనల ప్రవాహంలోంచి తల పైకెత్తేసరికి బస్సు స్లో అవుతోంది.

బహుశా వంపు తిరిగి ఉంటుంది బస్సు.

బస్సు దిగి చీకట్లో అలవాటుగా ఊళ్లోకి నడిచాను. తాతగారింట్లో బ్యాగ్ పడేసి వెంటనే నరసమామ్మ ఇంటికి బయలుదేరాను.

వీధి అరుగు మీద కూర్చునుంది నరసమామ్మ.

నరసమామ్మ కొడుకు కామేశం మామయ్య కూడా అరుగు మీదే కూర్చుని సిగరెట్ కాలుస్తూ తల్లితో ఏదో మాట్లాడుతున్నాడు నే వెళ్లేసరికి.

నన్ను చూస్తూనే- "రారా శీనుగా! బావున్నావా!" అన్నాడు కామేశం మామయ్య.

"బాగానే ఉన్నాను మామయ్యా!" అంటూ నరసమామ్మ పక్కకి చేరిపోయి కౌగిలించుకున్నాను.

"ఏరా శీనూ! పెద్దాడివైపోయావు" అంటూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది నన్ను.

"ఎలా ఉన్నావు మామ్మా!" అన్నాను.

"ఏదో! తాత పోయిన తర్వాత ఇలా బతికే ఉన్నాను" అన్నది విచారంగా.

అప్పుడు తేరిపార చూశాను నరసమామ్మని.

ఆరోగ్యంగా, పుష్టిగా ఉంది. మాటలో వణుకులేదు. చాలాసేపు చిన్నప్పటి ముచ్చట్లూ, తాత ఫార్సూ చెప్పుకున్నాక "ఒరేయ్ శీనూ! పూతరేకులు నిన్ననే చుట్టాన్రా! నా కార్డు అందుకుని నువ్వొస్తావని నాకు తెలుసు!" అంటూ చటుక్కున్న లేచి నుంచుంది.

నరసమామ్మ నిటారుగా నిలబడింది.

ఠీవిగా నడుస్తూ లోపలికెళ్లింది.

ఆమె వంగి నడవడం లేదు ఇప్పుడు.

అవును. తాతగారి ఊరు వస్తోందని తెలుసుకునేందుకు వంపు తిరిగిన రోడ్డు బండగుర్తు అయితే అయిఉండచ్చు కానీ, ఆ వంపు చూసి నరసమామ్మని గుర్తు తెచ్చుకోనవసరం లేదు. ★